

జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

నారాయణఖేడ్/చిన్నశంకరంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి పోర్టల్‌లో భాగంగా జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రోజుకో రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



‘క్రిటికల్ కేర్’ సిద్ధం

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ విభాగం ప్రారంభానికి సిద్ధమైంది. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో.. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.23.75 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సమాయత్తం చేస్తున్నారు. ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి వస్తే ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందనుంది.

-సంగారెడ్డి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి)

రోటరీ క్లబ్ సేవలు అమోఘం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



పరీక్షలు చేయించుకుంటున్న నిర్మలా జగ్గారెడ్డి



మహిళకు స్వయంగా పరీక్షలు చేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సదాశివపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ అధ్యక్షులు ఓదెల రాజశేఖర్, డాక్టర్ వెంకట రంగారెడ్డి డాక్టర్ ఎర్ర శివకుమార్, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, మాలతీలత, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రోహిత్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రనూకర్, మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ నికిత, డాక్టర్ ఆఫ్రిన్, డాక్టర్లు ప్రీతి, శ్రావ్య, కీర్తి, శ్రావణి పాల్గొన్నారు. పద్మావతి అంబులెన్స్ సర్వీస్ చరణ్ నరేష్ అందించారు. సదాశివపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఓదెల ప్రభు గుప్తా, సెక్రెటరీ అశోక్‌కుమార్ బస్సా ట్రెజరీ వేణు, సభ్యులు మాట్లాడుతూ శిబిరంలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, డయాబెటిస్, బీపీ, జనరల్‌హెల్త్‌కు సంబంధించి 320 మంది రోగులకు వైద్యం అందించామన్నారు. 52 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, 110 మందికి కార్డియాలజీ పరీక్షలు, 158 మందికి జనరల్ వైద్యాన్ని అందించి, ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు.

కూలీ డబ్బులు ఇవ్వనందుకే హతమార్చాడు

హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
నిందితుడికి రిమాండ్
వివరాలు వెల్లడించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

5

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ముగ్గురికి గాయాలు

5



వెంటాడుతున్న బీజీ-3 భూతం

- నిషేధిత విత్తనాలతో రైతుల బేజారు
- అధిక దిగుబడులంటూ అంటగడుతున్న వ్యాపారులు
- భూసార క్షీణత, కాలుష్య కారకమవడంతో నిషేధం
- గ్రామీణ మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయం
- కట్టడి చేయాలని రైతన్నల డిమాండ్

5

బోగస్ కార్డులపై కొరడా



మెదక్ జిల్లాలో 1,063 కార్డులపై ఫిర్యాదులు

673 మంది సభ్యుల తొలగింపు

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైనవారికి మాత్రమే ప్రజా పంపిణీ ప్రయోజనాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా కార్డుల ధ్రువీకరణ కోసం మెదక్ జిల్లా అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా ఫిర్యాదులు వచ్చిన కార్డులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వందల మంది సభ్యులను తొలగించారు.

మెదక్, మే 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ప్రస్తుతం 2,16,716 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతీ లబ్ధిదారుడికి మూడు నెలల రేషన్ బియ్యం జూన్ నెలలోనే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నెలకు 6 కిలోల బియ్యం చొప్పున.. మూడు నెలలకు 18 కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నారు. వర్షాకాల సీజన్‌లో ప్రతీ నెలా రేషన్ షాపుకు వెళ్లే అవసరం లేకండా ఒకే సారి రేషన్ ఇవ్వనున్నారు. ఇటీవల మెదక్ జిల్లావ్యాప్తంగా 3,800 కొత్త రేషన్ కార్డులను జారీ చేశారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వనున్న నేపథ్యంలో అనర్హులైన లబ్ధిదారులను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్ల ద్వారా అనర్హుల జాబితాను సేకరించి పేర్లను తొలగిస్తున్నారు. గత ఆరు నెలల నుంచి రేషన్ సరుకులు తీసుకోని వారి వివరాలు సేకరిస్తున్నారు. రేషన్ కార్డుల్లో పెళ్లి చేసుకుని అత్తారిళ్లకు వెళ్లినవారు, మృతుల పేర్లు కార్డుల నుంచి తీసేస్తున్నారు. కొందరి పేర్లు రెండు చోట్ల ఉండడంతో ఒక చోట తొలగిస్తున్నారు.

వెయ్యికి పైగా ఫిర్యాదులు

మెదక్ జిల్లాలో చేపట్టిన సర్వే ఆధారంగా దాదాపు 1,063 రేషన్ కార్డు సభ్యుల పేర్లు తొలగించాలని ఫిర్యాదులు డీలర్ల నుంచి స్వీకరించారు. విచారణ జరిపి ఇప్పటి వరకు 673 మంది అనర్హులను తొలగించారు. మండలాలవారీగా చిలప్‌చేడ్ 72, మెదక్ 70, నర్సాపూర్ 70, తూప్రాన్ 56, మనోహరాబాద్‌లో 67,

మిగతా 6వ పేజీలో

పటాన్‌చెరులో త్వరలో మూడు సబ్‌స్టేషన్లు ప్రారంభం

టెండర్ల దశలో మరో నాలుగు..
అమీన్‌పూర్‌లో రూ. 100 కోట్లతో భారీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, మే 30 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నిర్మించిన మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమీన్‌పూర్ చక్రపురికాలనీ, బీరంగూడ గోశాల, రామచంద్రాపురంలో నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్లను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పోచారం, సింఫనీపార్కుహోమ్స్ కాలనీ, రామేశ్వరంబండ, గడ్డపోతారంలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించామన్నారు. ఐలాపూర్‌లో రూ. 100 కోట్లతో 220/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



శెట్టికుంటలో నిర్మించిన ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కుంట ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో నిర్మాణాలు..

గృహప్రవేశం నాడే కూల్చివేత

అమీన్‌పూర్ మున్సిపాలిటీ శెట్టికుంట బఫర్ పరిధిలో పది ఇళ్లు నేలమట్టం

అమీన్‌పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శెట్టికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన కట్టడాలను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. సర్వే నంబర్ 997 పరిధిలో కుంట పరిధిలోకి వచ్చే లేఅవుట్‌లో గతంలోనూ పలు నిర్మాణాలను కూల్చివేశారు. కానీ, ఇటీవల మళ్లీ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో తహసీల్దార్ వెంకటేశ్ నేతృత్వంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఇందులో భాగంగా 200 గజాల్లో నిర్మాణం పూర్తి చేసిన మూడంతస్థుల భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు ఆ ఇంటితో పాటు నిర్మాణంలో ఉన్న మరో తొమ్మిది ఇళ్లను నేలమట్టం చేశారు.

స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయింపు

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శెట్టికుంట బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో 1980లో కొందరు స్వాతంత్ర్య సమరయోధులకు భూములను కేటాయించారు. ఇటీవల

మిగతా 6వ పేజీలో

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో దివ్యాంగుల ఆర్కెస్ట్రా బృందానికి రూ. 1,16,610 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. వారికోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా ననిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని, విద్యార్థులను భాగస్వాములను పేర్కొన్నారు. వేడుకల్లో శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రుశేఖర్, మాధురి, సంక్షేమాధికారి లలితకుమారి, దివ్యాంగుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ పాల్గొన్నారు.



దివ్యాంగులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి



మిన్పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

2,62,286 మెట్రిక్ టన్నులు

..మెదక్ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం

53,439 మంది రైతులకు రూ 464.35 కోట్లు చెల్లింపు

వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తిచేస్తాం : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతోందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలం మిన్పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 2,90,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వెల్లడించారు. 69,800 మంది రైతులకు రూ. 555.79 కోట్ల రూపాయలు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. వానాకాలం దగ్గరపడుతుండటంతో జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై దృష్టిసారించిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళనలకు చెందాల్సిన అవసరం లేదని, ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్, వెలుగు సీసీ శివరంజని, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ఉన్నారు.

నమ్మండి.. ఇవి పార్కులే..!

పచ్చదనం లేక జహీరాబాద్ మున్సిపాలిటీ వెలవెల

ఉండాల్సినవి వంద.. రికార్డుల్లో 58
ఆటవస్తువులు, ఆహ్లాదం కరువు
రాత్రి అయితే మందుబాబుల పాగా



హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో ఎండిపోయిన చెట్లు

జహీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ పట్టణంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. టౌన్‌ప్లానింగ్, జనాభాకు అనుగుణంగా పార్కులు లేకపోగా.. ఉన్నవి కూడా అధ్వానంగా తయారయ్యాయి. జహీరాబాద్ పట్టణ విస్తీర్ణాన్ని బట్టి సుమారు 100 పార్కులు ఉండాలి. కానీ, అధికారిక లెక్కల ప్రకారం 58 పార్కులు మాత్రమే ఉన్నాయి. అధికారికంగా ఏర్పాటైన 60 వెంచర్లలో పార్కులు ఎక్కడ ఉన్నాయో యజమానులకే తెలియాలి! పలుచోట్ల పార్కులు ఉండాల్సిన విస్తీర్ణం కంటే తక్కువగా ఉండగా.. మరికొన్ని వెంచర్లలో ప్లాట్లుగా చేసి విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. అనధికారికంగా ఏర్పాటైన మరో 20 వెంచర్లలో లెక్కలే లేవు. పట్టణంలో 37 వార్డులు ఉండగా.. వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. అయితే, రికార్డుల్లో మాత్రం పార్కులు ఉన్నప్పటికి క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు. ఉన్న పార్కుల్లోనూ ఆటవస్తువులు, పచ్చదనం మచ్చుకైనా కనిపించవు. సాయంత్రమైందంటే మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు స్పందిస్తూ నిధుల కొరత కారణంగా పార్కుల అభివృద్ధి కుంటుపడిందని, త్వరలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



వసంతవిహార్ కాలనీలో పార్కులోనే పార్కింగ్

కొనసాగుతున్న ‘ఇంటర్’ మూల్యాంకనం

సంగారెడ్డి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం కొనసాగుతున్నది 29, 30 తేదీల్లో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ పొలిటికల్ సైన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేశారు. నేటి నుంచి బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, ఎకనామిక్స్ జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు.

3 నుంచి ‘పది’ సప్లిమెంటరీ

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఒకే సెంటర్‌లో పరీక్షలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జూన్ 14 నుంచి 16 వరకు జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు.

64 కొనుగోలు కేంద్రాల మూసివేత

● రూ. 93 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



తూప్రాన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తవడంతో 64 కేంద్రాలు మూసివేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 80 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా కొనుగోలు పూర్తి కావడంతో 64 కేంద్రాలను మూసి వేసినట్లు వివరించారు. కేవలం 16 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 12,787 మంది రైతుల నుంచి 4,66,000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ. 93.35 కోట్ల నగదు జమ చేసినట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో 87 శాతం రైతులకు డబ్బులు జమ చేసినట్లు వివరించారు.

సమస్యల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

● ఐదేళ్లయినా పూర్తికాని నిర్మాణ పనులు
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న పునరావాసులు
● కొందరు ప్యాకేజీలకు దూరం.. మరికొందరికీ పూర్తికాని ఇళ్లు

ములుగు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొండపోచమ్మసాగర్ నిర్వాసితులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయిన నిర్వాసితులకు ఇంకా న్యాయం జరగలేదు. నిర్వాసితులకు ఎదురుచూపులు తప్ప లాభం చేకూరే పరిస్థితులు కనిపించడం లేదు. నిర్వాసితులకు ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ సరైన వసతులు, నిర్మాణాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు.

సిద్దిపేట జిల్లా ఉమ్మడి ములుగు మండలంలోని మామిడ్యాల, బైలంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తాండ గ్రామాల కలుపుతూ కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఆయా గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం, ఇళ్ల ప్యాకేజీ ప్రకటించారు. భూసేకరణపై కొందరు కోర్టుకు వెళ్లగా, మరికొందరికి ఇళ్లు, పరిహారం అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఊర్లన్నీ ఖాళీ చేయించారు. పరిహారం పొందిన కుటుంబాలకు ములుగు మండలం తునికిబొల్లారం గ్రామశివారులో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించి పునరావాసం కల్పించారు. కోర్టుకు వెళ్లి న కుటుంబాలకు పరిహారం నిర్ణయం జరగకపోవడంతో తాత్కాలికంగా రేకుల షెడ్స్ ఏర్పాటు చేసి నివాసం కల్పించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లతో పాటు, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల భవనం, కూరగాయల మార్కెట్, ఆలయాలు, ఫంక్షన్‌హాళ్లు నిర్మాణం చేస్తామని ప్రకటించారు.



అసంపూర్తిగా బైలంపూర్ ఫంక్షన్‌హాల్



పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ నిర్మాణం

అసంపూర్తి నిర్మాణాలు

ప్రభుత్వం ఇచ్చిన మేరకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఒక్కొక్క నిర్వాసిత గ్రామంలో పనులను మధ్యలోనే వదిలేశారు. మామిడ్యాలలో ఫంక్షన్ హాల్ పూర్తి చేసినప్పటికీ ప్రారంభించలేదు. దీంతో ఫంక్షన్‌హాల్ ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గ్రామస్థుల కోసం కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టి, పిల్లర్ల స్థాయిలోనే వదిలేశారు. గ్రామంలో నిర్మాణం చేపట్టిన ఆలయాలు కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణంలో నిలిచిపోయాయి. బైలంపూర్‌లో ఫంక్షన్ నిర్మా ణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఫంక్షన్‌హాల్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కూరగాయల మార్కెట్ స్థలం కేటాయింపులోనే నిలిచిపోయింది.

కొందరికీ ప్యాకేజీలు.. మరికొందరికీ ఇళ్లు..

కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. మామిడ్యాల, బైలంపూర్ గ్రామాలకు చెందిన పలువురి పరిహారం ప్యాకేజీలు అందజేయగా, ఇళ్లు అందజేయలేదు. మరికొందరికీ ఇళ్లు వచ్చి ప్యాకేజీలు రాలేదు. కొందరికైతే ప్యాకేజీలు, ఇళ్లు ఏవీ రాలేదు. బాధితులు పరిహారం, ఇళ్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్న న్యాయం జరగడంలేదని బాధితులు పేర్కొంటున్నారు.

ఇళ్ల నిర్మాణాలు

కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులో నిర్వాసితులు కొందరు ప్రభుత్వం ప్యాకేజీలు అందజేయడంతో ప్రస్తుతం నిర్మాణాలు చేసుకుంటున్నారు. కోర్టుకు వెళ్లిన బాధితులకు ప్రభుత్వం మారగానే ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల స్థలాలు కేటాయించడంతో నిర్మాణాలు స్వతహా చేసుకుంటున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్నాం



కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసి అద్దె ఇంట్లో ఉంటున్నాం. భూములు కోల్పోయి ప్యాకేజీ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా కుటుంబంలో నాతో పాటు, 18 ఏళ్లు నిండిన వారికి ఇల్లు, ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. నాకు ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు. నాతో పాటు నాలుగు ప్యాకేజీలు రావాలి. ఇప్పటికీ ఏ ఒక్కటీ దిక్కు లేదు.

- మోత్కూరి రమాదేవి

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు కోసం భూమి ఇచ్చాం.. కానీ ప్యాకేజీలు రావడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి ప్యాకేజీలు రానివారికి అందించే విధంగా కృషి చేయాలని కోరుతున్నాం.

- సత్యం, మామిడ్యాల



మృతిచెందిన రక్షిత్, గాయపడిన తల్లిదండ్రులు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతి

● తల్లిదండ్రులకు తీవ్రగాయాలు



రక్షిత్ (ఫైల్)



ధ్రువరెడ్డి(ఫైల్)

నర్సాపూర్/ బెజ్జంకి మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మెదక్ జిల్లా నర్సాపూర్, సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో శుక్రవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన సంగారెడ్డి రామిరెడ్డి తన భార్య మాధవి, మూడేళ్ల కుమారుడు ధ్రువరెడ్డి(3)తో కలిసి తమ గ్రామం నుండి మల్లంపేటకు స్కూటీపై వెళ్తున్నారు. నర్సాపూర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద స్కూటీ అదుపు తప్పి రేలింగ్‌ను ఢీకొట్టింది. ధ్రువరెడ్డి రేలింగ్‌కు బలంగా తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మాధవికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన గుళ్ల శ్రీకాంత్, కళ్యాణి కుమారుడు రక్షిత్ (7) కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంపై ముగ్గురు కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని బ్లాక్ కలర్ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో రక్షిత్ అక్కడిక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొన్న తర్వాత దాదాపు 150 మీటర్ల వరకు రోడ్డుపై ఈడ్చుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్, కళ్యాణిని అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



వివరాలు తెలుసుకుంటున్న బీడీఎల్ పోలీస్ అధికారులు

ఫర్నీచర్ గోదాంలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరురూరల్, మే 30(ఆంధ్రజ్యోతి) : బీడీఎల్ భానూర్ పోలీసస్టేషన్ పరిధి పాటి గ్రామంలోని అను ఫర్నీచర్ గోడౌన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బీడీఎల్ పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎంత మేరకు నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది. షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

హవేళిఘణపూర్, మే 30(ఆంధ్రజ్యోతి); రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని డైట్, హవేళిఘణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన జీవో 317, పాతపెన్షన్ విధానం అమలు చేయడం, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్న డీఏ, జీపీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన విద్య ఉంటుందని తమ పిల్లలను ఈ బడిలోనే చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో సుదర్శనమూర్తి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, స్వరూపారాణి, రామారావు, మాధవరెడ్డి, సిద్దు, బీజేపీ నాయకులు గడ్డం శ్రీనివాస్, సత్యనారాయణ, సంతోష్, కాశీనాథ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న బీజీ-3 భూతం

- నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల బెడదతో రైతుల బేజారు
- తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు అంటూ అంటగడుతున్న వ్యాపారులు
- భూసార క్షీణత, కాలుష్య కారక బీజీ-3పై నిషేధం
- అయినా గ్రామీణ మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాలు
- కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్



గత ఏడాది పట్టుబడిన అనుమతి లేని బీజీ-3 పత్తి విత్తనాలు

గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను కల్తీ భూతం వెంటాడుతోంది. నకిలీ, నాసిరకం విత్తనాల నిరోధానికి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినా రైతులకు మాత్రం బీజీ-3తో పాటు నకిలీ విత్తనాలు చేరుతున్నాయి. ఏటా ఈ సంఖ్య కొంత మేర తగ్గుతున్నా పూర్తిస్థాయిలో నివారించడం సాధ్యపడడంలేదు. గ్రామీణ స్థాయిలో అధిక దిగుబడులు, తక్కువ ధర పేరుతో పలువురు వ్యాపారులు నాసిరకం, కల్తీ విత్తనాలను విక్రయించి రైతులను ముంచుతున్నారు. వేసవి ఆరంభం నుంచే గ్రామాల్లో మాటువేసిన ఏజెంట్లు తక్కువ ధరకు, అప్పు కింద ఇస్తామని రైతులను మభ్యపెట్టి కల్తీ విత్తనాలు అంటగడుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉంది. ప్రధానంగా పత్తిని వర్షాధార పంటగా సాగుచేసే రైతులను వీరు లక్ష్యంగా చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 రకం పత్తి విత్తనాలతో పాటు, లూజ్ విత్తనాలను రైతులకు అంటగడుతూ వ్యాపారులు, ఏజెంట్లు దండుకుంటుండగా, ఆ విత్తనాలు సాగుచేసిన రైతులు మాత్రం ఆశించిన దిగుబడులు రాక నష్టాల పాలవుతున్నారు. అయినప్పటికీ రైతులు మాత్రం ఈ విత్తన సాగుపై నిరాసక్తి ప్రదర్శించడం లేదు.

బీజీ-3తో అనేక నష్టాలు...

బీజీ-3 సాగు వలన భూసారం తీవ్రంగా కోల్పోవడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి తీవ్ర కారకంగా ఉంటుందనే శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో వీటిని నిషేధించారు. కేవలం బీజీ-1, బీజీ-2 విత్తనాలను మాత్రమే రైతులు సాగుచేయాలి. అయితే బీజీ-2 విత్తనాలను అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు, వాటిని నేరుగా రైతులకు సరఫరా చేస్తున్నాయి. బీజీ-2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, అదే బీజీ-3 సాగుచేస్తే పంట దిగుబడి పూర్తయ్యేంత వరకు దోమపోటుతో పాటు, పురుగుల బెడద, తెగుళ్ల తాకిడి ఉండదనే ప్రచారంతో ఈ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి సైతం బీజీ-2 కంటే 30 శాతం మేర ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు. పెట్టుబడి సైతం తగ్గుతుందని, పురుగుమందులు, దోమమందులు, తెగుళ్ల మందులు వినియోగించే అవసరం ఉండకపోవడంతో పెట్టుబడి సైతం 50 శాతం మేర తగ్గుతుందనే ప్రచారం బలంగా ఉండడంతో రైతులు సైతం బీజీ-3 విత్తనాల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

కట్టడి చేస్తేనే..

బీజీ-3, నకిలీ విత్తనాలను మార్కెట్లోకి రాక ముందే తయారీ సందర్భంలోనే కట్టడి చేయడమే వీటి నియంత్రణకు ఏకైక పరిష్కారమనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా బీజీ-3 విత్తనాలను తీసుకువస్తున్న ముఠాలను గుర్తించి వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాల తయారీ కంపెనీలపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని, బీజీ-3, లూజ్ విత్తనాలను బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. జర్మినేషన్ పరీక్షల తర్వాత ఫెయిల్ విత్తనాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారమని రైతుసంఘాల నాయకులు సూచిస్తున్నారు.

గతేడాది సీజన్ అయిపోయాక..

గతేడాది సీజన్ అయిపోయిన అనంతరం రాయపోల్, వర్గల్ మండలాల్లోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బీజీ-3, అనుమతి లేని, నకిలీ విత్తనాలు లభించాయి. అప్పట్లో మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ద్వారా తనిఖీలు నిర్వహించినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారులు రైతులకు బీజీ-3, నకిలీ విత్తనాలను విక్రయించారు. ఉన్నతాధికారులు సమావేశాలు పెట్టి గట్టి నిఘా పెట్టాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం పనితీరు సరిగా లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు, నష్టం తప్పడం లేదు. ముఖ్యంగా వర్గల్, రాయపోల్ మండలంలోని బొర్రగూడెం, మాదారం, ఎల్కల్, బేగంపేట తదితర గ్రామాల్లో బీజీ-3 విత్తనాలు గతంలో చాలా సార్లు పట్టుబడ్డాయి. గతేడాది ములుగు మండలంలోని పలు గ్రామాల్లో గల ఆయా కంపెనీల్లో అనుమతి లేని విత్తనాలు పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి.

తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుంటేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు రసీదును తప్పనిసరిగా తీసుకుని దాచిపెట్టుకోవాలి. లూజ్ విత్తనాలు, అనుమతి లేని, నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో రైతులు తీసుకోవద్దు. ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి.

-బాబునాయక్, వ్యవసాయ శాఖ ఏడీ

నకిలీ విత్తనాలపై నిఘా



నకిలీ, అనుమతి లేని విత్తనాలపై పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశాం. మండలాల వారీగా మండల టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. క్రమం తప్పకుండా ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. ఎవరైనా నకిలీ, అనుమతి లేని, రసీదు లేని విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు లేదా పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- కె. నర్సింహులు, ఏసీపీ గజ్వేల్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో పడి ఉన్న రంగు రాహుల్

చేర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటనల కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన రంగు రాహుల్ (25), గడ్డం అజయ్ బైక్‌పై కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కిష్టంపేట శివారులో అశోక్ లేలాండ్ వాహనాన్ని వారు ఢీ కొనడంతో బైక్‌పై నుంచి కిందపడిపోయారు. రాహుల్ తలకు గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారకస్థితిలోకి చేరుకోగా, అజయ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాహుల్ మృతిచెందాడు. బైక్ నడుపుతున్న రాహుల్ తలకు బలమైన గాయమైన క్రమంలో హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవి. మృతుడి కుటుంబీకులు కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని..



ఘటనా స్థలంలో రక్తపు మడుగులో పడి ఉన్న విష్ణుప్రసాద్

పాపన్నపేట, మే 30(ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం కేంద్రం పాపన్నపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విష్ణుప్రసాద్(28) ఉపాధి నిమిత్తం పాపన్నపేటలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి సరుకులు తెచ్చుకోవడానికి బయటికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటే క్రమంలో మెదక్ వైపు నుంచి వస్తున్న ఓ కారు మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అతనిడి ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయలైన విష్ణుప్రసాద్‌ను స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్, డీసీఎం ఢీకొని యువకుడు..

- భార్య, కొడుకుకు తీవ్ర గాయాలు



మృతుడు నరేష్

మర్కుక్, మే 30 (ఆంధ్రజ్యోతి): డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి కుటంబ సభ్యులు, మర్కుక్ ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొల్గూరు నరేష్(35) తన భార్య కళ్యాణి, కుమారుడు అంశూత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గౌరారం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం, ద్విచక్రవాహనం రెండు ఢీకొనడంతో నరేష్, అతడి భార్య, కొడుకుకు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌ను రప్పించి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించ గా చికిత్స పొందుతూ నరేష్ మృతిచెందాడు. కళ్యాణి, అంశూత్‌లను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కొమురయ్య(60) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.



గ్రామపంచాయతీ ఆవరణలో ఆందోళన చేస్తున్న వివిధ పార్టీ నాయకులు

బొంతపల్లికి ఒకటే ఇందిరమ్మ ఇల్లు

- గ్రామస్థుల ఆగ్రహం
- అధికారిక శంకుస్థాపన బహిష్కరణ

గుమ్మడిదల, మే 30 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి వార్డు కార్యాలయం పరిధిలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ చేయటానికి వచ్చిన అధికారులను గ్రామస్థులు నిలదీశారు. తమ గ్రామానికి ఒకటే ఇల్లును మంజూరు చేస్తారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆందోళన దిగారు. శనివారం గుమ్మడిదల మండలంలో వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల చేత అధికారులు శంకుస్థాపన చేయించారు. ఇందులో భాగంగా బొంతపల్లి గ్రామంలో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని గ్రామస్థులు బహిష్కరించారు. 10 వేల మంది జనాభా, 6వేల ఓట్లు ఉన్న గ్రామానికి కేవలం ఒక ఇల్లు మాత్రమే మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీకి ఒకే ఇల్లు ఇవ్వడం బాధాకరమన్నారు. గ్రామంలో అనేక నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నపటికీ ఒకరికే ఇల్లు మంజూరు చేయడం తగతదన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు. ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని ఇళ్ల మంజూరు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, మే 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేట్ మండలం బాచేపల్లిలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలని గురుకులం ప్రిన్సిపాల్ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒకటో తరగతిలో 30 ఖాళీలు, 5వ తరగతిలో 16 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు పాఠశాలలో జూన్ 6న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 9వ తేదిన పాఠశాలలో ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సొంత మండలం విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన వారి జాబితా 10వ తేదీన పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. ఆధార్, ఫోటో, ధ్రువీకరణ, పత్రాలను పాఠశాలలో అందించాలని సూచించారు.

కార్యదర్శులకు బుజ్జగింపు !

- డీఎస్ఆర్ నుంచి తూకం ఆప్షన్ తొలగింపునకు సుముఖత

దుబ్బాక, మే30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సహాయనిరాకరణతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు దిగొచ్చారు. కార్యదర్శులను బుజ్జగించే చర్యలకు ఉపక్రమించారు. పంచాయతీ కార్యదర్శులతో చర్చలు జరిపి అటెండెన్స్ అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన జిల్లాలోని డీపీవోలు, డీఎల్‌పీవోలకు సూత్రపాయంగా ఆదేశాలు జారీ చేశారు. డీఎస్ఆర్ యాప్‌లోని తడి,పొడి చెత్తను తూకం వేసే అంశాన్ని తొలగిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఎంపీవోలు పంచాయతీ కార్యదర్శులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధులకు హాజరు కావాలని కోరారు. డీఎస్ఆర్ యథావిధిగా ఉంటుందని, వెంటనే అటెండెన్స్‌ను వేయాల్సిందిగా ఆదేశించారు. కాగా, శుక్రవారం సాయంత్రం వరకు దీనిపై పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాము అప్పు చేసి, గ్రామపంచాయతీలకు ఖర్చు చేసిన డబ్బులను ఇవ్వాలని కూడా వారు పెట్టిన డిమాండ్‌లో ప్రధానంగా ఉందని వారు తెలుపగా.. ఆర్థికపరమైన అంశాలు తమచేతులో లేవని అధికారులు తేల్చిచెప్పారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం కార్యదర్శులను సముదాయించేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తున్నారు. శనివారం కార్యదర్శులు ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పొరపాట్లు పునరావృతం కావొద్దు

- ఇంటర్ బోర్డ్ అబ్జర్వర్ భీమ్‌సింగ్

సిద్దిపేట కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పులు చేస్తే చర్యలు తప్పవని ఇంటర్ బోర్డ్ అబ్జర్వర్ భీమ్‌సింగ్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్)లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపు అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మూల్యాంకన కేంద్రం అధికారి రవీందర్‌రెడ్డితో కలిసి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లను క్యాంపు అధికారుల దృష్టికి తెచ్చామని, అవి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఎగ్జామినర్ మదింపు చేసిన పేపర్‌ను సీఈ లేదా ఎస్ఈ మదింపు చేస్తే ఐదు మార్కులు కంటే ఎక్కువ తేడా వస్తే సంబంధిత ఏఈకి మెమో జారీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మూల్యాంకన కేంద్రం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉందని, హైదరాబాద్ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రతీ అంశాన్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థుల జవాబు పత్రాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మదింపు చేయాలని సూచించారు. ఈసారి ప్రతీ రెండు బోర్డులకు ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ను నియమించామన్నారు. చీఫ్ ఎగ్జామినర్(సీఈ)లు, స్క్రూటినైజర్లు వారి విధులను పక్కాగా చేస్తే పొరపాట్లకు తావుండదని చెప్పారు. క్యాంపు అధికారి, డీఐఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట మూల్యాంకన కేంద్రానికి మంచి పేరు ఉందని, అధ్యాపకులు నిబద్ధతతో పనిచేసి విద్యార్థులకు నష్టం జరగకుండా మదింపు చేసి మంచి పేరును నిలుపుకోవాలని సూచించారు. జనరల్-1 సత్యనారాయణరెడ్డి, జనరల్-2 మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వార్షికోత్సవం



మాట్లాడుతున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి

నారాయణఖేడ్, మే 30(ఆంధ్రజ్యోతి): జీవితం శాంతియుతంగా ముందుకు సాగాలంటే ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పుడే సాధ్యమని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతిమాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ శివార్లలోని రమాసహిత సత్యనారాయణస్వామి 21వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్, వేద పండితులు గురుజ్యోషి, బ్రాహ్మణ సంఘం బాధ్యులు రాఘవాచారిజ్యోషి, పద్మనాభచారి, వినోద్‌పంతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారణలో దర్శనమిస్తున్న స్వామివారు

కూలీ డబ్బు ఇవ్వనందుకే హతమార్చాడు

- 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

తూప్రాన్, మే 30(ఆంధ్రజ్యోతి): చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లింపు విషయంలో జరిగిన గొడవలో దాడి చేసి హతమర్చాడు ఓ వ్యక్తి. బుధవారం రాత్రి జరిగిన ఈ హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితుడిని అదపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని కేషన్ పరిశ్రమలో చోటుచేసుకున్నది. సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సీఐ రంగ కృష్ణ, మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌లతో కలిసి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలోని కేషన్ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్ ఏసుదాసన్ వద్ద బుధవారం హైదరాబాద్ బండ్లగూడకు చెందిన వద్దవత్ నరేష్, ఉప్పల్ చిలుకనగర్‌కు చెందిన కే.నలీన్‌కుమార్ (55), అంజద్‌లు కూలీ పనులు చేశారు. పనుల అనంతరం అందరూ పరిశ్రమలోని లేబర్ రూంలో ఉన్నారు. కొంత సమయానికి అంజద్ ఇంటికి వెళ్లిపోగా, నరేష్, నలీన్‌కుమార్ ఇద్దరు రాత్రి 7గంటలకు బయటకు వెళ్లారు. నలీన్‌కుమార్ మద్యం సేవించగా, నరేష్ తాగకుండానే లేబర్ రూంకు వచ్చారు. రాత్రి 11 గంటలకు నలీన్‌కుమార్ మద్యం మత్తులో నరేష్‌తో గొడవ పడి, నరేష్‌ను ఇంటికి వెళ్లిపోవాలంటూ బెదిరించాడు. దాంతో కూలీ డబ్బులు ఇస్తే పోతానంటూ నరేష్ చెప్పగా, రూ. 100 ఇస్తానంటూ నలీన్‌కుమార్ చెప్పాడు. మొత్తం కూలీ డబ్బులు ఇవ్వాలనడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో నరేష్ నలీన్‌కుమార్‌ను చెంపపై కొట్టి తోసివేయగా అతడి తలకు గాయమైంది. అనంతరం ఛాతిపై దాడి చేయగా నలీన్‌కుమార్ కుప్పకూలి మృతిచెందాడు. దీంతో నరేష్ మొబైల్ ఫోన్ తీసుకొని రూంకు తాళం వేసి కాంపౌండ్‌వాల్ దూకి పారిపోయాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద నిందితుడు నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో కేసును ఛేధించి నిందితుడిని పట్టుకున్న సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, సిబ్బందిని అభినందించారు.

బంగారు నగల కోసం మహిళ దారుణ హత్య

- గొంతుకోసి పుస్తెల తాడు, నాను ఎత్తుకెళ్లిన దుండగులు
- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలో ఘటన



బాల్‌లక్ష్మి(ఫైల్)

చిన్నకోడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాల కోసం గుర్తు తెలియని దుండగులు ఓ మహిళను గొంతు కోసి హతమార్చిన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన గాలి బాల్‌లక్ష్మి(55) ఇంటి వద్ద కిరాణం షాపు నిర్వహిస్తుండగా భర్త సుధాకర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు స్వాతి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం బాల్‌లక్ష్మి షాప్‌లో ఉండగా గుర్తు తెలియని దుండగులు వచ్చి కూల్ డ్రింక్ కొనుగోలు చేశారు. అనంతరం బాల్‌లక్ష్మి టీ పెట్టుకుని తాగేందుకు ఇంట్లోకి వెళ్లగా గమనించిన దుండగులు షాప్ పక్కన ఉన్న గేటు నుంచి ఇంట్లోకి వెళ్లి ఆమెను బంగారు ఆభరణాలు ఇవ్వాలని బెదిరించారు. ఆమె ప్రతిఘటించడంతో బాల్‌లక్ష్మి గొంతు కోసి దారుణంగా హత్య చేసి పుస్తెల తాడు, నాను తీసుకుని పరారయ్యారు. సాయంత్రం ఇంటి తిరిగి వచ్చిన భర్త సుధాకర్ బాల్‌లక్ష్మి రక్తపు మడుగులో పడి మతిచెంది ఉండటాన్ని గమనించి చుట్టుపక్కల వారికి చెప్పాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆనవాళ్ల ఆధారంగా ఆభరణాల కోసమే బాల్‌లక్ష్మిని గొంతుకోసి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మృతురాలి భర్త సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తదితరులు

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలకు అనుసంధానమైన ప్రధాన రోడ్లు అధ్వానం
- అడుగులోతు గుంతలు.. కంకర తేలిన రోడ్లు
- బ్రిడ్జిల వద్ద కుంగిన రహదారులు.. నడి రోడ్డుపై రంధ్రాలు
- నిర్వహణ లేక ప్రమాదకరంగా మారిన వైనం
- వందలాదిగా భారీ వాహనాల రాకపోకలు


సంగారెడ్డి నుంచి రంగారెడ్డి, వికారాబాద్‌ను అనుసంధానం చేసే ప్రధాన రోడ్డుపై గుంతలు


కోనాపూర్, గడిమల్కాపూర్‌కు వెళ్లే రోడ్డుపై తేలిన కంకర


కొండాపూర్ వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు

కొండాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలను అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్లు అధ్వానంగా మారి అడుగులోతు గుంతలతో ప్రమాదాలకు నెలవుగా మారాయి. సంగారెడ్డి నుంచి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాను అనుసంధానం చేస్తూ హైదరాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలతో దర్శనమిస్తున్నది. బ్రిడ్జిల వద్ద రోడ్డు కుంగడం నడిరోడ్డుపై భారీ రంధ్రాలు ఏర్పడి ప్రయాణికులకు, వాహనదారులకు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆయా పరిశ్రమలకు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భారీ వాహనాల రద్దీ అధికంగా ఉండి, జిల్లాలను కలిపే ప్రధాన రోడ్డు కావడంతో అనునిత్యం ప్రమాదాలకు నెలవైంది.

ప్రయాణం.. నరకప్రాయం

ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు వాహనాలకు రాకపోకలకు రోడ్డు ఉన్నప్పటికీ, భారీ గుంతలు ఏర్పడటం వల్ల ఒకవైపు నుంచి ప్రయాణంతో వాహనాలు నిలిచి సామాన్య ప్రయాణికులకు అంతరాయం ఏర్పడుతుంది. 14కిలో మీటర్ల రోడ్డుపై 17 బ్రిడ్జిలు ఉండగా ప్రతీ బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోయింది. అనునిత్యం ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ ఈ నరకప్రాయంగా మారిన రోడ్డును బాగు చేయాలని వేడుకుంటున్నారు.

రోడ్డుపై దారి పొడవునా ముళ్ల పొదలు

మండల కేంద్రమైన కొండాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై దారి పొడవునా మూలమలుపులు, ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు విరివిగా పెరిగాయి. మండల కేంద్రానికి వెళ్లేందుకు 16 గ్రామాల ప్రజలు రాకపోకలకు అనుసంధానంగా ఈ రోడ్డు ఉన్నది. మల్లేపల్లి, మల్కాపూర్‌లలో వివిధ పరిశ్రమలకు 8గ్రామాల నుంచి వెళ్లే కార్మికులకు ఈ దారే ప్రధానం. మూలమలుపులు, ముళ్లపొదలతో కూడిన ఈ రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు అదుపుతప్పితే తీవ్ర ప్రమాదాలు జరిగి ఒక్కోసారి ప్రాణనష్టం జరిగే పరిస్థితులు ఉన్నారు.

20 ఏళ్ల నాటి రోడ్లకు నిర్వహణ కరువు

గొల్లపల్లి నుంచి సీ కోనాపూర్‌కు వెళ్లేందుకు 20ఏళ్ల క్రితం 3కిలో మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం పనులు చేశారు. నాటినుంచి రోడ్డును పట్టించుకోకపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. మునిదేవునిపల్లి మధిర గ్రామమైన గడిమల్కాపూర్‌కు కలుపుతూ హైదరాబాద్ జిల్లాకు అనుసంధానం చేసే రోడ్డు 22ఏళ్ల క్రితం వేశారు. రోడ్డుకు వేసిన కంకర తేలిపోయి వాహనాన్ని నడుపలేక నడిచి వెళ్లేందుకు సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ దారిపై వెళ్లేవారి బాధలు వర్ణనాతీతం. రోడ్ల పరిస్థితిని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

మల్కాపూర్ చౌరస్తా నుంచి షైతాబ్‌ఖాన్‌గూడ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలకు గుంతలు ఏర్పాడాయి. గుంతల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ జరిపి రోడ్డు పై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయిస్తాం.

-శైనీ, అర్‌అండ్‌బీ ఏఈ

న్యూస్ బాక్స్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నాగల్‌గిద్ద, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్గి చౌరస్తాలో శుక్రవారం నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నాగల్‌గిద్ద ఎస్‌ఐ సాయిలు సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు.

సివిల్ రైట్స్ పై అవగాహన

మనోహరాబాద్ మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ స్వేచ్ఛ, హక్కులపై అవగాహన కల్గి ఉండాలని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని జీడిపల్లి గ్రామంలో అర్‌ఐ దీక్షిత్ ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో దళితులతో కలసి మాట్లాడారు. సదస్సులో జీడిపల్లి గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శి సత్య నారాయణ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

నారాయణఖేడ్/జిన్నారం, మే 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మికులు పోరాటాల కోసం సిద్ధం కావాలన్నారు. అంతకు ముందు ఆయన సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు శకుంతల, నాయకులు తదితరులు ఉన్నారు. జిన్నారం మండలంలోని కాజీపల్లి టీఐడీసీ పరిశ్రమ వద్ద సీఐటీయూ యూనియన్ కార్మికులు జెండాను ఎగురవేశారు. కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ పరిశీలన

నాగల్‌గిద్ద, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారముంగి, కరస్‌గుత్తి గ్రామాల్లో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం నాగల్‌గిద్ద మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నాగల్‌గిద్దలో పలు ఫర్టిలైజర్ షాపులనుప్రవీణ్‌చారి తనిఖీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

జిన్నారం, మే 30(ఆంధ్రజ్యోతి): జిన్నారం మండల వ్యాప్తంగా ఇందిరమ్మ నివాసాల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. జిన్నారంలో ఎంపీడీవో అరుణ, వివిధ గ్రామాల్లో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్, నరేందర్‌గౌడ్ తదితరులు ఇందిరమ్మ నివాసాల నిర్మాణ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు.

నాగల్‌గిద్దలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి: కేవీపీఎస్

నాగల్‌గిద్ద, మే 30(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి కోరారు. శుక్రవారం నాగల్‌గిద్దలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయం లేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం స్పందించి, నాగల్‌గిద్దలో గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

నారాయణఖేడ్, మే 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయ కమిటీని ఎన్నుకోవడం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని ఈవో శివరుద్రప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీలో పని చేయడానికి ఆసక్తి ఉన్నవారు పది రోజులలోపు సంగారెడ్డిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని ఆయన కోరారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

- ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


చేగుంటలోని ఓ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ కుమార్

చేగుంట/పాపన్నపేట/అల్లాదుర్గం/వెల్దుర్తి/జహీరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు, పోలీసులు అధికారులతో కలిసి విత్తన, ఎరువుల షాపుల్లో తనిఖీలను ముమ్మరంచేశారు. ఈ క్రమంలో శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లోని షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, రికార్డు పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, లైసెన్సులు రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు.డీలర్లకు పలు సూచనలు చేశారు. శుక్రవారం చేగుంట మండల కేంద్రంలోని పెస్టిసైడ్, ఎరువుల దుకాణాలను మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నకిలీలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామన్నారు. పాపన్నపేట మండల కేంద్రంలోని ఆగ్రో గ్రోమోర్ మందులు ఎరువులు విత్తనాల విక్రయ కేంద్రాలను వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి, ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, ఏఈవో జనార్దన్ పాల్గొన్నారు. అల్లాదుర్గంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి, ఏవో రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీ చేసి పలు రికార్డులను, విత్తనాల బస్తాలను, ప్యాకెట్లను పరిశీలించారు. వెల్దుర్తిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వెల్దుర్తి ఇన్‌చార్జి ఎస్‌ఐ జ్యోతి, వ్యవసాయ శాఖ ఏవో ర్యూస్సీ ఆధ్వర్యంలో తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. జహీరాబాద్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తనిఖీలు చేశారు. ఇందులో భాగంగ ఆమె పట్టణంలోని పలు దుకాణాల్లో విత్తనాలకు సంబంధించి శాంపిల్స్ సేకరించారు. శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల లేబరేటరీకి పంపిస్తున్నట్లు చెప్పారు.

రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని తక్షణమే అన్‌లోడ్ చేసుకోవాలి


శివ్వంపేట: దొంతిలోని రైస్‌మిల్లులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

శివ్వంపేట మే 30 (ఆంధ్రజ్యోతి) అకాల వర్షాలకు రైతులకు ఇబ్బంది కలగకుండా రైస్ మిల్లర్లు రైస్ మిల్లులకు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెనువెంటనే అన్ లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ నాగేష్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలో కామాక్షి రైస్ మిల్లును అకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అకాలవర్షాల దృష్ట్యా రైస్ మిల్లర్లు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎం జగదీష్ కుమార్, డీఎస్‌వో సురేష్ రెడ్డి, సీఈవో మధు యాదవ్ రైతులు ఉన్నారు.

- **అల్లాదుర్గం:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్నాయని అల్లాదుర్గం తహసీల్దార్ మల్లయ్య, ఏకేపీ ఏపీఎం నాగరాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని సీతానగర్, రాంపూర్ గ్రామాలో పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంతో ఆ కేంద్రాలను మూసివేశామన్నారు. కాయిదంపల్లి, గడిపెద్దాపూర్, అల్లాదుర్గం తదితర గ్రామాల్లోనూ మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

గో సంరక్షణకు చర్యలు చేపట్టాలి

పుల్‌కల్/అల్లాదుర్గం/మాసాయిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): గోరక్ష చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ పల్లె ప్రభుకుమార్‌గౌడ్ కోరారు. ఈమేరకు శుక్రవారం పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోగిపేట ప్రచండ సంయోజక్ మనోహర్‌గౌడ్, మండల గోరక్ష సంయోజక్ చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ పుల్కల్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గోవుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతు అల్లాదుర్గంలోని బీజేవైఎం నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ మల్లయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. గోవుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతు అల్లాదుర్గంలోని బీజేవైఎం నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం కార్యదర్శి మదన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్ సభ్యులు కృష్ణ, శివ, శివ్వాగౌడ్, రాజు, పాండు, వెంకట్, నరేందర్ ఉన్నారు. అక్రమ పశు రవాణాను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తూ మాసాయిపేట మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు, చేగుంట పోలీసులకు వినతి పత్రం అందజేశారు. పలు గ్రామాల నుంచి పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మొలుగు నాగేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా బడిబాట


టేక్మాల్: కుసంగి గ్రామంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

తూప్రాన్/చేగుంట/టేక్మాల్/చిన్నశంకరంపేట/నారాయణఖేడ్/కంది, మే 30(ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ముందస్తు బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. ఇందులో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ బడిబయట పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రయోజనాలను వివరించారు. గ్రామాల్లోని ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి కూలీలకు అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీలు చేపట్టారు. శుక్రవారం తూప్రాన్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, తల్లిదండ్రులతో కలిసి బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు రజిత, జ్యోతి, దుర్గ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. చేగుంట మండలం ప్రాథమిక పాఠశాల కర్నాల్‌పల్లిలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ బడి ఈడు పిల్లలను బడిలోకి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో ఉపాధి పని చేస్తున్న కూలీల వద్ద వెళ్లి అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్,సుభాష్,మురళి సిఆర్‌పి మొగులయ్య తదితరులు ఉన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట, గవ్వలపల్లి, శాలిపేట, జంగరాయి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.


కంది: ఎద్దుమైలారం ప్రభుత్వ పాఠశాలలో కూతురిని చేర్పిస్తున్న మాజీ ఉపసర్పంచ్

ఈ సందర్భంగా ఎంఈవో పుష్పవేణి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. కందిమండలం ఎద్దుమైలారంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు పర్యటించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరిస్తూ, గత విద్యార్థులు సాధించిన మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇందుకు స్పందించిన ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న తన కూతురు రేణుకను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

కుంట ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో నిర్మాణాలు..

గృహప్రవేశం నాడే కూల్చివేత

(3వ పేజీ తరువాయి)

భూముల ధరలు పెరగడంతో వారి వారసులు రియల్ వ్యాపారులకు విక్రయించారు. 2015లో ఇ భూముల్లో లేఅవుట్లు వేసి ప్లాట్లను అప్పట్లో బిల్డర్లు నిర్మించిన 40 ఇళ్లను కూల్చివేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అప్పటి నుంచి వ్యవహారం కోర్టుల్లో నానుతోంది. ఇటీవల నిర్మాణాలు జోరందుకోవడంతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. తాజాగా కూల్చివేతలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

బోగస్ కార్డులపై కొరడా

(3వ పేజీ తరువాయి)

అల్లాదుర్గం 62, పెద్దశంకరంపేట 41, పాపన్నపేట 48, శివ్వంపేట మండలంలో 35 మంది అనర్హులున్నట్లు విచారణలో గుర్తించారు. ఇంకా 212 లబ్ధిదారుల వివరాలపై విచారణ చేపట్టాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఆరు నెలలుగా స్పెషల్‌డ్రైవ్

అర్హులైన పేదలకు రేషన్ బియ్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆరు నెలల నుంచి రేషన్ బియ్యం తీసుకోని వారి వివరాలు సేకరిస్తున్నాం. ఎందుకు తీసుకోవడం లేదో పరిశీలించి, పేర్లను కార్డుల నుంచి తొలగిస్తున్నాం.

-సురేష్‌రెడ్డి, డీఎస్‌వో, మెదక్

శిలాంపల్లిలో రైతులకు అవగాహన

చిలప్‌చెడ్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిలాంపల్లిలో శుక్రవారం స్థానిక రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞానసంస్థ శాస్త్రవేత్త రవిప్రకాష్, వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు చిన్నబాబు, శేషు తదితరులు పాల్గొని రైతులకు నేల ఆరోగ్యం, వరిలో అధిక దిగుబడినిచ్చే రకాల గురించి వరిలో సమగ్ర ఎరువుల యజమాన్యం, సమగ్ర సస్యరక్షణ తదితర అంశాలను వివరించారు.

కురుమలు అభివృద్ధి చెందాలి



మునిపల్లి, మే30 (ఆంధ్రజ్యోతి): కురుమ కులస్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేష్ కురుమ పేర్కొన్నారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుమ సంఘం యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి పాండుకు సభ్యత్వ నమోదు పుస్తకాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో జోగిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ గూడెం మల్లయ్య కురుమ, కురుమ హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ పోచారం రాములు కురుమ, సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అందోల్ కృష్ణ కురుమ, గొర్రె కాపరుల సహకార సంఘం మాజీ డైరెక్టర్లు నవాబుగారి భూమయ్య, అంబారి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ సమస్యలపై చర్యలు


దరఖాస్తులు, భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ బృందాల అధికారులు

కొండాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు కొండాపూర్ తహసీల్దార్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ కార్యాలయంలో సదస్సు బృందాల అధికారులతో రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల భూ రికార్డులకు నివేదికలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 1718 దరఖాస్తులకు 600పైగా సమస్యలపై నివేదనలు తయారు చేసినట్లు వెల్లడించారు. భూ భారతి చట్టాన్ని అనుసరిస్తూ లబ్ధిదారులకు న్యాయం చేకూరుస్తామన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం: సునీతారెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో పూర్తిగా విఫలం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు విత్తనాల కొరత తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. జూన్ నెలకు విత్తనాలు అవసరం ఉన్నా, ఇప్పటికీఅందుబాటులో లేవన్నారు. రైతుల ఇబ్బందులను జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. బీఆర్‌ఎస్ ఎప్పుడు రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్లు


నిజాంపేటలో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/ పెద్ద శంకరంపేట, మే 30(ఆంధ్రజ్యోతి): పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల నిర్మాణం పథకాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేట్, బాచేపల్లి, జంబికుంటలతో పాటు పెద్దశంకరంపేట, మూసాపేటలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాము మొదటి ప్రాధాన్యతలో గృహాలు లేని అర్హులైన నిరుపేదలకు అవకాశం ఇస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సంగ్రాం, ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాధాకిషన్, మాజీ ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, నాయకులు శంకర్, వెంకటేశం, మిస్కిన్, సుదర్శన్, ప్రదీప్‌గౌడ్, శ్రీకాంత్, రఘురెడ్డి, శివ, పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో షాకీర్‌అలీ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై ఇంత నిర్లక్ష్యమా?


అల్గోల్ చౌరస్తా వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


జహీరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణ సమీపంలోని అల్గోల్ చౌరస్త(బైపాస్ రోడ్డు) వద్ద భరత్‌నగర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నా అధికారులకు పట్టడంలేదా అని జహీరాబాద్ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అల్గోల్ చౌరస్తా వద్ద పాడైగుంతలమయంగా మారిన రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఈరోడ్డుపై ఎందుకింత నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకడమేంటని అధికారులను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌కు పనులను రద్దుచేసి మరో కాంట్రాక్టర్‌కు అప్పగించాలని చెప్పారు. రోడ్డుపనులను త్వరగా పూర్తి చేయకపోతే ఆందోళనకు దిగుతామని అధికారులను హెచ్చరించారు. రోడ్డు పాడైన విషయాన్ని ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోదర భావంతో పండుగలు జరుపుకోవాలి: డీఎస్పీ

నర్సాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బక్రీద్ సందర్భంగా శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుశాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు, నాయకుల పోలీసుశాఖకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం, మాజీ మున్సిపల్ చైర్మన్లు మురళీధర్‌యాదవ్, అశోక్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

- కంగ్టి,మే 30(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను అందరూ శాంతియుతంగా జరుపుకోవాలని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ దుర్గారెడి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలు, యువజన సంఘాలతో పీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు

రైతు సంక్షేమానికి మోదీ సర్కార్ పెద్దపీట


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మెదక్ అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రధాని మోదీ సర్కార్ పెద్దపీట వేస్తోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 వానాకాలం సీజన్ 14 పంటలకు ప్రకటించిన మద్దతు ధర పట్ల కిసాన్‌మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కేంద్రం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధం

మాసాయిపేట మే 30 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలంలోని రైతులకు 80 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏవో రాజశేఖర్ గౌడ్ తెలిపారు. 30 కేజీల బస్తా రూ.2,137 చొప్పున రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నట్టు తెలిపారు. రైతు ఆగ్రో కేంద్రం ద్వారా రైతులు జీలుగు విత్తనాలు కొనుగోలు చేయవచ్చని వ్యవసాయ అధికారి తెలిపారు.